టైటిల్‌కి తగ్గట్టుగా..

విజయ్ 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్' (గోట్)పై కోలీవుడ్‌లో భారీ అంచనాలున్నాయి. విజయ్ తమిళ రాజకీయాల్లోకి ఎంటరైన నేపథ్యంలో ఈ సినిమానే అతని చివరి సినిమా అనే ప్రచారం కారణంగానే ఈ హైప్. ఇతర భాషలకు చెందిన ప్రేక్షకులు కూడా 'గోట్' కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. విజయ్ తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయిక. వెంకట్‌ప్రభు దర్శకుడు. కల్పాతి అఘోరం, కల్పాతి గణేశ్, కల్పాతి సురేశ్ నిర్మాతలు. సెప్టెంబర్ 5న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఈ సినిమా ట్రైలర్‌ని శనివారం సాయంత్రం 5గంటలకు విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ని కూడా మేకర్స్ విడుదల చేశారు. గూండాలను గన్‌తో కాలుస్తూ పవర్‌పుల్‌గా విజయ్ ఈ లుక్‌లో కనిపిస్తున్నారు. విజయ్ కెరీర్‌లో మైలురాయిలా నిలిచిపోయేలా ఈ సినిమా రూపొందుతున్నదని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు.

శాంతితో కూడిన నిశ్శబ్ద మ్యూజియం

సమంత మానసికంగా చాలా స్ట్రాంగ్. అటు వైవాహిక జీవితం విఫలమైనా, ఇటు మయోసైటిస్ వల్ల శారీరక బాధలు ఎదురైనా.. అభ్యంతరకర వార్తలు తనపై ట్రోల్ అయినా.. సామ్ మాత్రం ఎప్పుడూ చలించలేదు. అందుకే ఆమెను శక్తివంతమైన మహిళ అనొచ్చు. నాగచైతన్య, శోభితా ధూళిపాళల వివాహ వార్త వచ్చినప్పట్నుంచీ సమంతపై సోషల్‌మీడియా కాన్సన్‌ట్రేషన్ కాస్త ఎక్కువైంది. ఆమెపై నెగెటివ్ పోస్టులు పెడుతున్న వాళ్లు కొందరైతే, ఆమెపై పాజిటీవ్‌గా స్పందిస్తున్న వాళ్లు కొందరు. వీటన్నింటికీ సమాధానాన్నిస్తున్నట్టు రీసెంట్‌గా తన ఇన్‌స్టాలో ఓ ఫొటోను పోస్ట్ చేసింది సమంత. 'శాంతి, నిశ్శబ్ద మ్యూజియం' అనే కొటేషన్ వున్న టీషర్ట్ ధరించిన ఆమె.. తాను శాంతితో కూడిన నిశ్శబ్ద మ్యూజియం లాంటి దాన్ననీ.. అనవసర రూమర్స్ ఎన్ని వచ్చినా ప్రశాంతంగా ఉండటం తన నైజమని చెబుతూ, గాగుల్స్‌తో గర్వంగా నవ్వుతున్న ఫొటో షేర్ చేసింది సమంత. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ ఫొటో బాగా వైరల్ అవుతున్నది.

హ్యాట్రిక్‌కు సిద్ధం

నాని, వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో వచ్చిన 'అంటే సుందరానికీ..' సినిమా అనుకున్నంత ఆడలేదు. అయితే.. వివేక్ ఆత్రేయ టేకింగ్‌పై మాత్రం ప్రశంసలొచ్చాయి. వీరిద్దరి కలయికలో వస్తున్న రెండో సినిమా 'సరిపోదా శనివారం'. ఈ నెల 29న సినిమా విడుదల కానుంది. ఇది పూర్తిగా ఒక ఫిక్షనల్ విలేజ్ నేపథ్యంలో సాగే సినిమా అని సమాచారం. ఇందులో నాని పాత్ర అత్యంత శక్తిమంతంగా దర్శకుడు డిజైన్ చేసినట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం ద్వితీయశ్రేణి హీరోల్లో నాని ముందున్నారు. రీసెంట్‌గా 'దసరా' సినిమాతో వంద కోట్ల మార్కును కూడా దాటేశారు. దసరా, హాయ్‌నాన్న సినిమాలతో వెంటవెంటనే హిట్లు అందుకున్నారు. ఇప్పుడు 'సరిపోదా శనివారం' కూడా హిట్ అయితే హ్యాట్రిక్ హీరోగా అవతరిస్తారు. అందుకే ఈ సినిమాకోసం నాని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సినిమా సినిమాకూ క్రేజ్ పెంచుకుంటూ దూసుకెళ్తున్న నాని రాబోవు సినిమాల విషయానికొస్తే.. సుజిత్ దర్శకత్వంలో ఆయన ఓ పాన్ ఇండియా సినిమా చేయనున్నారు. ఆ సినిమా బడ్జెట్ వందకోట్ల పైమాటేనట. అలాగే తనకు 'దసరా' లాంటి బ్లాక్‌బాస్టర్ ఇచ్చిన శ్రీకాంత్ ఓదేల దర్శకత్వంలో కూడా నాని ఓ సినిమా చేయనున్నాడు. ఆ సినిమా బడ్జెట్ 150కోట్లు అని టాక్.

కొత్త సినిమా మొదలైంది

విశ్వక్‌సేన్ కొత్త సినిమా మొదలైంది. 'వీఎస్13' వర్కింగ్ టైటిల్‌తో మొదలైన ఈ చిత్రానికి దర్శకుడు శ్రీధర్ గంట. సుధాకర్ చెరుకూరి నిర్మాత. గురువారం ఈ చిత్రం షూటింగ్ పూజాకార్యక్రమాలతో లాంఛనంగా మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి 'విశ్వంభర' దర్శకుడు వశిష్ట క్లాప్ ఇవ్వగా, శ్రీకాంత్ ఓదెల కెమెరా స్విచాన్ చేశారు. నిర్మాతలు నాగవంశీ, సాహు గారపాటి, స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందించారు. ఈ చిత్రంలో విశ్వక్‌సేన్ ఫెరోషియస్ పోలీస్‌గా కనిపించనున్నారు. ఇటీవల ఈ లుక్‌లో పోస్టర్‌ని కూడా మేకర్స్ విడుదల చేసిన విషయం తెలిసిందే. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ యూనిక్ పొలిటికల్ యాక్షన్ డ్రామా రెగ్యులర్ షూటింగ్ వచ్చే నెల నుంచి మొదలవుతుందని, 'ఎప్రీ యాక్షన్ ఫైర్స్ ఏ రియాక్షన్' అనే ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో కన్నడ నటి సంపద కథానాయికగా నటిస్తున్నది. ఈ చిత్రానికి కెమెరా: 'తంగలాన్'ఫేం కిశోర్‌కుమార్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాణం: ఎస్ఎల్వీ సినిమాస్.

నేను ఇంగ్లిష్‌లో కాస్త వీక్

రీసెంట్‌గా షారుక్‌ఖాన్ ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో 'మీరు ఇప్పటివరకూ హాలీవుడ్ సినిమా ఎందుకు చేయలేదు?' అనే ప్రశ్న ఎదురైంది. దానికి ఆయన ఆసక్తికరమైన సమాధానం ఇచ్చారు. 'హాలీవుడ్ సినిమా చేయాలంటే ముందు ఆ స్థాయిలో ఇంగ్లిష్ మాట్లాడగలిగే భాషా ప్రావీణ్యం నాకు కావాలి. ఎందుకంటే నేను ఇంగ్లిష్‌లో కాస్త వీక్. అలాగే ఇండియన్ ఆడియన్స్ నాకు ఎంతో గౌరవం ఇచ్చారు. నా కుటుంబాన్ని కూడా అంతే గౌరవంగా ఆదరిస్తున్నారు. వారందరూ తృప్తి పడేంత గొప్ప పాత్ర దొరకాలి. మొత్తంగా చెప్పేదేంటంటే.. ఇందులో మొదటి సమస్య నాదైతే... రెండో సమస్య విధిది. ఈ రెండూ కలిసొస్తే.. తప్పకుండా ఫ్యూచర్‌లో హాలీవుడ్ సినిమా చేస్తా. అలాగే.. హాలీవుడ్ ప్రేక్షకులతో కూర్చుని ఇండియన్ సినిమా చూడటం నా కల. ఆ కల ఎప్పుడు తీరుతుందా? అని ఎదురు చూస్తున్నా' అన్నారు షారుక్.

బాలీవుడ్‌లో అది మిస్సయింది

'హీరోయిజం.. మాస్ అప్పీల్ అనేవి భారతీయ సినిమాకు మూలాలు. బాలీవుడ్ సినిమా వీటిని మిస్ అయ్యింది. అవి సౌతిండియన్ సినిమాలో బాగా కనిపిస్తున్నాయి. అందుకే సౌత్ సినిమా ప్రపంచవ్యాప్త గుర్తింపును సాధిస్తున్నది' అన్నారు బాలీవుడ్ అగ్ర నటుడు సంజయ్‌దత్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్ సినిమా పోకడ గురించి ఆయన ఆసక్తిక రంగా వ్యాఖ్యానించారు. 'సినిమా ప్రేక్షకులు ముంబయి, ఢిల్లీ, హైదరాబాద్ లాంటి మహానగరాల నుంచి మాత్రమే రారు. జార్ఖండ్, బీహార్, యూపీ, మధ్యప్రదేశ్ నుంచి కూడా వస్తారు. వాళ్లకు హీరోయిజమే కావాలి. థియేటర్లలో ఈలలు వేయాలనుకుంటారు. గోల చేయాలనుకుంటారు. ఆ పరిస్థితి బాలీవుడ్‌లో అమితాబ్ టైమ్‌లో ఉండేది. ఆ తర్వాత మేం కూడా అలాంటి సినిమాలు చేశాం. ఇప్పుడైతే లేదు. ఇప్పుడు హీరోయిజం, మాస్ అప్పీల్ ఉన్న సినిమాలు దక్షిణాది నుంచి ఎక్కువగా వస్తున్నాయి.' అని పేర్కొన్నారు సంజయ్‌దత్.

వినోదాత్మకంగా 'భలే ఉన్నాడే'

రాజ్‌తరుణ్ కొత్త సినిమా 'భలే ఉన్నాడే'. మనీషా కంద్కూర్ కథానాయిక. జె.శివసాయి వర్ధన్ దర్శకుడు. అగ్ర దర్శకుడు మారుతి సమర్పణలో ఎన్.వి.కిరణ్‌కుమార్ నిర్మిస్తున్నారు. వినాయకచవితి కానుకగా సెప్టెంబర్ 7న సినిమాను విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా రిలీజ్‌డేట్ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. పూర్తి వినోదాత్మకంగా ఈ సినిమా రూపొందుతున్నదని మేకర్స్ తెలిపారు. సింగీతం శ్రీనివాస్, అభిరామి, అమ్ము అభిరామి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: నగేష్ బానెల్లా, సంగీతం: శేఖర్‌చంద్ర, నిర్మాణం: రవికిరణ్ ఆర్ట్స్.

సైనికుల త్యాగాలకు దర్పణం

సంతోష్ కల్వచర్ల, పావని జంటగా నటిస్తున్న చిత్రం 'జై జవాన్'. నాగబాబు పోటు దర్శకత్వంలో సందిరెడ్డి శ్రీనివాసరావు, పోసం మధుసూదన్ రెడ్డి, పోటు వెంకటేశ్వర్లు నిర్మిస్తున్నారు. గురువారం ఈ చిత్ర ట్రైలర్‌ను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దర్శకుడు మలినేని గోపీచంద్ విడుదల చేశారు. దేశభక్తి నేపథ్యంలో రూపొందించిన ఈ చిత్రంలో సైనికులు చేస్తున్న త్యాగాలను కళ్లకు కట్టినట్లుగా చూపించామని దర్శకుడు తెలిపారు. ట్రైలర్‌లో ఉన్న 'జన్మనిచ్చిన తల్లిదండ్రుల రుణాన్ని, జీవితాన్నిచ్చిన మాతృభూమి రుణాన్ని తీర్చుకునేది ఒక జవాన్ మాత్రమే' అనే సంభాషణలు ఆకట్టుకున్నాయి. ఈ చిత్రానికి కెమెరా: బాబు కొలబతుల, రచన-దర్శకత్వం: నాగబాబు పోటు.

దసరా బరిలో 'పాట్టేల్'

యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల ప్రధాన పాత్రధారులుగా రూరల్ నేపథ్య కథాంశంతో రూపొందుతున్న చిత్రం 'పాట్టేల్'. సాహిత్ మోత్కూరి దర్శకుడు. నిశాంక్ రెడ్డి కుడితి, సురేశ్ కుమార్ సడిగే నిర్మాత. దసరా కానుకగా ఈ సినిమా థియేటర్లలో విడుదల కానున్నట్టు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా రిలీజ్ డేట్ పోస్టర్ ఆకట్టుకుంటున్నది. యువచంద్రకృష్ణ, అనన్య నాగళ్లతో పాటు ఓ పాప, పొట్టేల్ వీరి నేపథ్యంలో జాతీయ జెండా. పోస్టర్ స్ఫూర్తిదాయకంగా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో అజయ్, ప్రియాంకశర్మ, తనస్వీచౌదరి, నోయల్ సీన్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: మోనిష్ భూపతిరాజ్, సంగీతం: శేఖర్‌చంద్ర, నిర్మాణం: నిసా ఎంటర్‌టైన్మెంట్స్, ప్రజ్ఞ సన్నిధి క్రియేషన్స్.